
# చేదు నిజం

కె. మురళీకృష్ణ



తెల్లవారు ఝామునే ఆటో ఇంటి ముందు ఆగటంతో 'ఎవరో, ఆ వచ్చింది?' అని చూడటం కోసం బయటకు వచ్చాడు ఆనందరావు.

ఆటోలోంచి దిగుతున్న రాజారావును గుర్తుపట్టలేకపోయాడు. ఆ వెనకే దిగుతున్న అతని భార్య చంద్రికను చూసి రాజారావును గుర్తు పట్టాడు ఆనందరావు.

'అదేమిటి ఇలా అయిపోయావు, నడిచే ఆస్థి పంజరంలా?' అడగకుండా ఉండలేకపోయాడు ఆనందరావు.

నీరసంగా నవ్వాడు రాజారావు. బదులేమీ చెప్పలేదు.

'ఆయనేం చెప్తారు? నన్నడగండి నేను చెప్తాను.' సూట్‌కేసు లోపలకు తీసుకువస్తూ అంది చంద్రిక.

'రండి, రండి' అలికిడి విని బయటకు వచ్చిన ఆనందరావు భార్య వరలక్ష్మి వీరిని సంతోషంగా పలకరించింది.

వరలక్ష్మి, చంద్రికలు ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఇంట్లోకి వెళ్లారు.

'ఏమిటది రాజా, ఇలాగయిపోయావు?' అడిగాడు ఆనందరావు.

'అది తెలుసుకునేందుకే వచ్చాను. ఇక్కడి హాస్పటల్‌కు రిఫర్ చేశాడు మా డాక్టర్."

'ఏమయింది?'

"అదే తెలియటం లేదు. నీరసంగా ఉంటోంది. మాట్లాడినా, కదలినా ఆయాసంగా ఉంటోంది."

"మీ పుత్ర రత్నాలేరి?"

" ఆ రత్నాలకు అర్ధసంవత్సర పరీక్షలన్నీ అరగదీస్తున్నారు. వాళ్ల అమ్మమ్మ ఇంట్లో ఉంచి వచ్చాము."

ఇంతలో వరలక్ష్మి కాఫీ పట్టుకువచ్చింది.

"లక్ష్మి ఇవాళ నువ్వు సెలవు పెట్టెయ్యి" అన్నాడు రాజారావు.

లక్ష్మి 'అలాగే' అనే లోపలే రాజారావు అడ్డుపడ్డాడు.

"సెలవు పెట్టనవసరం లేదు. మేమెలాగో ఇంకాస్సేపటికి మెడికల్ టెస్టులకు వెళ్లాలి. సాయంత్రం దాకా రాము. రాత్రి చివరి బస్సుకు వెళ్లిపోతాము. ఇంత మాత్రానికి సెలవెందుకు?"

"అబ్బ ఏం రోగాలో, ఏం డాక్టర్లో? జలగలు రక్తం పీలిస్తే డాక్టర్లు డబ్బు పిండుకుంటున్నారు. ఈయనకీ రోగం వచ్చినప్పటి నుంచీ ఛస్తున్నామనుకోండి. వెయ్యని మందులేదు. వెళ్లని డాక్టరు లేడు. డబ్బు సంపాదించటం ఎంత కష్టమో, ఖర్చు చేయటం అంత సులభం. మంచినీళ్లలా ఖర్చయిపోతోంది డబ్బు" అంటూ గదిలోకి వచ్చింది చంద్రిక.

రాజారావు తలవంచుకున్నాడు.

చంద్రిక వెనకే వచ్చిన వరలక్ష్మి ఆనందరావు వైపు చూసింది. ఆమె కళ్లలో ఏదోభావం లీలగా కదలి మాయమయింది. ఆనందరావు మౌనంగా ఉన్నాడు.

"మీదో సలహా కావాలండి" అంది చంద్రిక కుర్చీని లాక్కుని కూచుంటూ.

సలహాలడిగేవారు సగం మంది తమ అభిప్రాయాలను బలపరచుకొనేందుకే సలహాలడుగుతారని, నిజానికి అక్కడ తాను కొత్తగా ఇవ్వవలసిన సలహా ఏమీ ఉండదని ఆనందరావుకు తెలుసు.

"ఏమిటి?" అని అడిగాడు.

"ఈయనకేదో పరీక్ష చేయాలట. గుండె దగ్గర ఏదో కోసి తీసి చూడాలట. దానిపేరు గుర్తుండి ఛావటం లేదు. అయితే ఆ పరీక్ష చేయగానే అవసరమైతే వెంటనే ఇంకేదో ఆపరేషన్ చేయాలట. లక్ష పైగా ఖర్చవుతుందంటున్నారు. మీకు తెలిసిన డాక్టర్లెవరైనా తక్కువలో చేస్తారా? అసలు ఆపరేషన్ అవసరమో కాదో ముందు చెప్పగలరేమో కనుక్కోగలవా?"

"ఏమిటి గుండె జబ్బా?" అడిగాడు ఆనందరావు.

" ఆ గుండె జబ్బా? నా బొందా? సిగరెట్లు మానమంటే మానరు. గొప్ప హీరో ఫోజులు. మరి జబ్బులు రావద్దంటే ఆగుతాయా? అస్తమానం అర్ధరాత్రి వరకూ ఫ్రెండ్లతో సిగరెట్లు పీలుస్తూ, టీలు తాగుతూ కూచుంటారు. దమ్మిడీ ఆదాయం లేదు, క్షణం తీరిక లేదు. ఇప్పుడు ఒకవేళ లక్ష అవసరం అంటే నేను మళ్లీ ఊరెళ్లి వాళ్లనీ, వీళ్లనీ అడిగి తెస్తాను. కానీ ఆ తరువాత మళ్లీ ఈయన సిగరెట్లు తాగరని గ్యారంటీ ఏముంది? మళ్లీ ఇంకో లక్ష అప్పు కాదని ఏముంది?"

రాజారావు వంచిన తల ఎత్తలేదు.

వరలక్ష్మి లోపలకు వెళ్లిపోయింది.

"మరి ఏమాలోచించారు?" అడిగాడు ఆనందరావు.

"మాకు తెలిసిన డాక్టరు ఒకామె ఇక్కడే ఉంది. ముందు ఆమెని కలుస్తాము. ఆమె తక్కువలో పరీక్ష చేయిస్తుందేమో చూస్తాము. కానీ వెంటనే ఇంకో ఆపరేషన్ అవసరమైతేనే సమస్య. అలా కాకున్నా యాభైవేలకు తగ్గేట్టు లేదు. మా అమ్మా అన్నయ్యలను అడిగితే కాదనరు. కానీ ఏ ముఖం పెట్టుకుని అడగాలి?"

"అదంతా ఇప్పుడెందుకు చంద్రికా? డాక్టరు దగ్గరకెళ్లిన తరువాత ఆలోచిద్దాం" అన్నాడు రాజారావు నీరసంగా.

"ఏమాలోచిస్తారండీ మీరు? మీ కసలు ఆలోచనలేమైనా ఉన్నాయా? ఇరవైనాలుగు గంటలు సిగరెట్లు పీల్చి రోగం తెచ్చుకున్నారు. ఇప్పుడీ కష్టపడి మనం దాచిన డబ్బంతా కలిపితే పదివేలు లేవు. రేపు మన పిల్లలు భవిష్యత్తు గురించి ఏమైనా ఆలోచించారా? ఏమాలోచిస్తారు మీరు?" ఉరిమింది చంద్రిక.

"నా కేమీ కాలేదసలు. నీ హడావిడితోనే సగం నీరసం వస్తోంది. ఏమైందినా కసలు? పద ఇంటికెళ్లి పోదాం,

డాక్టర్లు వద్దు. ఖర్చులు వద్దు. బతికినన్నాళ్లు బతుకుతాం. చచ్చేరోజు ఛావక తప్పుతుందా?" ఆయాసం రావటంతో ఆగిపోయాడు రాజారావు.

"ఏమైనా అంటే ఇదొకటి. రొయ్యకు బారెడు రోషమట!" విసవిసా లోపలకు వెళ్లిపోయింది చంద్రిక.

ఆనందరావుకు రాజారావు వైపు చూడబుద్ధి కాలేదు. పక్కనే ఉన్న వార్తా పత్రికలో తలదూర్చాడు.

రాజారావు నెమ్మదిగా లేచి బయటకు వెళ్లిపోయాడు.

కాస్సేపటి తరువాత సిగరెట్ వాసన గాలిలో తేలుతూ ఆనందరావు వరకూ వచ్చింది.

ఆనందరావు వెళ్లి చూశాడు.

బయట అరుగు మీద కూర్చుని శూన్యంలోకి నిర్లిప్తంగా చూస్తూ సిగరెట్ కాలుస్తున్నాడు రాజారావు.

ఆనందరావు హృదయం కలచివేసినట్టయింది.

ఇంతలో చంద్రిక బిరబిరా వచ్చింది.

"సిగ్గులేదూ. మళ్లీ సిగరెట్ వెలిగించారు? ఏముందా సిగరెట్‌లో? ఒక పక్క గుండె ఇప్పుడో, ఇంకో క్షణమో, అన్నట్టుంది. మళ్లీ సిగరెట్లు కావాల్సి వచ్చాయా? ఇప్పటికి వేలకు వేలు పోసి డాక్టర్ల చుట్టూ తిరగలేక ఛస్తున్నాను. మళ్లీ వెలిగించారు సిగరెట్లు. ఛీ ఛీ" అంటూ లోపలకు వెళ్లిపోయింది.

ఆనందరావు రాజారావు వైపు చూశాడు.

రాజారావు నిర్లిప్తంగా మరో సిగరెట్ వెలిగించాడు.

"పదండి టై మయింది వెళ్తాం" అంటూ వచ్చింది చంద్రిక.

రాజారావు నెమ్మదిగా లేచాడు. 'సాయంత్రం వస్తాం' అంటూ ఆమె వెనకే వెళ్లాడు.

"ఛ, ఈమెకింతయినా బుద్ధి లేదు. ఒక పక్క మనిషి ఎంత బాధ పడుతున్నాడో చూడండి. ఈమె ఎంతసేపూ డబ్బు ఖర్చు, డబ్బు ఖర్చు అని గోలపెడుతోంది. పాపం ఆయనలో జీవితేచ్ఛను చంపేస్తోందీమె" ఆఫీసుకి తయారవుతూ అంది వరలక్ష్మి ఆనందరావుతో.

ఆనందరావు నవ్వుతూ ఏదో అనబోయాడు. ఇంతలో 'అయ్యో టైమైపోయింది' అంటూ ఒక్క గెంతులో బయట పడింది వరలక్ష్మి.

***   ***

"పరీక్షలన్నీ అయిపోయాయా?" సాయంత్రం ఆనందరావు అడిగాడు రాజారావును.

"అయినట్టూ కానట్టు. డాక్టరు చూసింది. ఆంజియోగ్రఫీ చేయాలంది. అది చేస్తే కానీ సరిగ్గా తెలియదట. కానీ అది చేసిన వెంటనే అవసరమైతే ఇంకో ఆపరేషన్ చేయాలట. ఎటు చేసి లక్ష, లక్షన్నర తప్పనిసరి."

"మరేం ఆలోచించారు"

"మా ఊరెళ్లి ఆలోచిస్తాం. ఈలోగా వాడేందుకు ఏవో మందులున్నాయి."

"సిగరెట్లు ఇప్పుడయినా మానుతున్నావా, లేదా?"

విచిత్రంగా నవ్వాడు రాజారావు. సిగరెట్ వెలిగించి "మాని కూడా సాధించేదేముంది?" అన్నాడు.

"చూడు రాజా, నీ పరిస్థితి నాకు అర్థం అవుతోంది. నువ్వు నీ సెల్ఫ్‌పిటీ పొరలను తొలగించి నీ భార్యవైపు నుంచి ఆలోచించి చూడు. ఆమె భవిష్యత్తు ఎంత అనిశ్చిత పరిస్థితిలో వుందో ఆలోచించు. నీ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించు. ఆ తరువాత ఆమె ప్రవర్తనలో మంచి చెడు నిర్ణయించు. ఆమెని అర్థం చేసుకుని ప్రేమగా ప్రవర్తిస్తావో, అసహ్యించుకుని కసిగా ప్రవర్తిస్తావో నీ ఇష్టం. కనీసం ఇకనైనా సిగరెట్లు మాని బాధ్యతాయుతంగా ప్రవర్తించు. నీకొక విషయం చెబుతా విను. అన్నీ సరిగ్గా వున్నన్నీ రోజులు ఆనందంగా వుండటం గొప్పకాదు. ప్రతికూల పరిస్థితులలో కూడా అన్యోన్యంగా, ఆనందంగా వుండటంలోనే మనుషుల గొప్పతనం తెలుస్తుంది.

ఆయువు ఉన్నన్నాళ్లు జీవించటం మనిషి కర్తవ్యం. ఒక చీమను చూడు. చివరి క్షణం వరకూ బతకాలని ప్రయత్నం చేస్తుంటుంది. ఒక బొద్దింక వెంటపడి చూడు. చివరిక్షణం వరకూ కొట్టుకుంటూ ఇంకో క్షణం అదనంగా ఊపిరి పీల్చాలని ఆరాటపడుతుంటుంది. అంతకన్నా తీసిపోయిందా మనిషి జీవితం? మరణం అనివార్యం. కానీ దానిని ఆహ్వానించే పరాజితులంటే నాకు అసహ్యం. బతకాలి. వీలయినంతకాలం హాయిగా నవ్వుతూ, నవ్విస్తూ సంతోషంగా బతకాలి. ఇకనైనా నీ ప్రవర్తనను విశ్లేషించి చూసుకో. మన తరువాతి తరానికి ధనధాన్యాలు ఇవ్వకపోయినా కానీ ఆరోగ్యవంతమైన వాతావరణం, సంతోషకరమైన జ్ఞాపకాలు ఇవ్వటం మన చేతుల్లో వుంది. నువ్వు నీకే కాదు, నీ భార్యాపిల్లలకు కూడా అన్యాయం చేస్తున్నావు. మనిషికి కావల్సింది భోగభాగ్యాలు కాదు. ఒక ప్రేమపూరితమైన మాట. ప్రేమ నిండిన చర్య. అదిచాలు ప్రపంచంలో ప్రశాంత జ్యోతులను వెలిగించేందుకు. నీ జీవితంలో ఆనంద దీపకళికలు వెలిగించుకుంటావో, సిగరెట్టు పీకల బూడిదతో నింపుకుంటావో నీ ఇష్టం" అన్నాడు ఆనందరావు ఆవేశంగా.

చాలాసేపు ఇద్దరి మధ్య మౌనం రాజ్యం చేసింది.

"ఏమండీ, సిగరెట్ కాల్చటం అయ్యిందా? చలిలో బయట కూర్చోకండి. ముందే మీ ఆరోగ్యం మంచిది కాదు. పైగా రాత్రికి ప్రయాణంకూడా చెయ్యాలి" అని అరిచింది చంద్రిక లోపలనుంచి.

రాజారావు లేచి ఆనందరావు కళ్లలోకి దీర్ఘంగా చూసి 'వస్తున్నా' అంటూ లోపలికి వెళ్లాడు.

***   ***

"ఛ ఏం మనిషండీ? మనిషి ప్రాణం కన్నా డబ్బెక్కువా? నాతో ఏమందో తెలుసా?" పక్కబట్టలు దులుపుతూ అంది వరలక్ష్మి.

"నువ్వు చెబితే కదా తెలిసేది" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"మీకంతా నవ్వులాటే లెండి. ఇన్నాళ్లూ కష్టపడి, నోరు కట్టుకుని కూడబెట్టిన డబ్బంతా ఈయన మందులకే అవుతోంది. పైగా అప్పుచేయాల్సి వచ్చేట్టుంది. అంతా ఈయన మీద ఖర్చుపెట్టిన తరువాత ఈయన ఛస్తే మాకు దిక్కెవరు? అప్పులతో నడివీధిలో నిలబడాల్సి వుంటుంది అంది. ఇలా ఆలోచించేవారుకూడా వుంటారాండీ? కథల్లో, నవల్లో చదవటం తప్పించి ఇలాంటి వారిని చూడటం ఇదే ప్రథమం. పైగా ఇప్పుడు ఆమె వూర్లో చేయించే వైద్యం ఏమిటో తెలుసా?"

"అదీ నువ్వే చెప్పు"

"వాళ్ల ఊళ్లో సంతోషీమాత భక్తురాలు ఒకామె ఉందట. ఆమె ఇచ్చే కుంకుమ రోజూ పొద్దునా, సాయంత్రం ఈయన నోట్లో వేస్తే సకల రోగాలు పోతాయట. ఇది మూర్ఖత్వమా? డబ్బు ఖర్చు తప్పించుకునే మార్గమా?" మనసులోని వేదనను వెళ్లగక్కింది వరలక్ష్మి.

నవ్వాడు ఆనందరావు.

"అది సహజమోయ్. మనిషిలోని అసలు మనిషి బయటకు వచ్చేది కష్ట సమయంలోనే. ఆమె ఇద్దరు పిల్లల తల్లిగా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తోంది. ఇప్పుడు అప్పోసప్పో తెచ్చి వైద్యం చేయిస్తుంది. ఇవాళపోయేవాడు ఇంకో రెండేళ్లు బతుకుతాడు. ఈ రెండేళ్లలో లక్ష అప్పు తీర్చగలడా? పిల్లలకు భవిష్యత్తును ఇవ్వగలడా? ఆమెకు రాజారావు మీద ప్రేమ లేక కాదు. కానీ ఆమె రాజారావు భార్యలాకాక ఇద్దరు పిల్లల బాధ్యత తనమీద వున్న తల్లిలా ఆలోచిస్తోంది. ఎదుటి వ్యక్తిని విమర్శించటం సులభం. సానుభూతితో అర్థం చేసుకోవటం కష్టం. కనీసం రాజారావు సిగరెట్లు మాని బాధ్యతగా ప్రవర్తించినా ఆమె ఏదో చేసినా అర్థం వుంటుంది."

"అంటే డబ్బు ఖర్చని వైద్యం చేయకుండా చస్తేఛావనీ అని వదిలేయడం సమంజసమా?"

"అది సమంజసంగా అనిపించకపోవచ్చు. కానీ ఇది చేదు నిజం లక్ష్మీ. ఎంతోమంది ఎన్నోరకాల రోగాలతో మరణిస్తున్నారు. అందరికీ ఉన్నత స్థాయి వైద్యం అందుతోందా? అందరూ ఆస్థాయి వైద్యాన్ని కొనే స్థితిలో వున్నారా? ఇటువంటి పరిస్థితిలో ఎంతమంది చంద్రికలా తమ ఓటమిని ఏమీ చేయలేని అశక్తతను, ఆ అశక్తతపై కోపాన్ని, ఆవేదనను ఎలాంటి కఠోరమైన ప్రవర్తన వెనుక దాస్తున్నారో ఆలోచించు. పైకి కఠినంగా కనిపించినా కొబ్బరిలో అమృతప్రాయమైన జలం వుంటుంది గమనించు.

మనకు తెలిసింది ఒక చంద్రికనే. కానీ తరచిచూడు. అడుగడుక్కీ అనేక చంద్రికలు వుంటారు. భౌతికమైన డబ్బు బరువు కింద మానసికమైన ప్రేమ అణిగిపోతోంది వరలక్ష్మీ" ఆవేదనగా అన్నాడు ఆనందరావు.

"కానీ ఆమె సానుభూతిగా వ్యవహరిస్తే బావుండేది కదా! మాటలతో సగం చంపుతోంది" అంది వరలక్ష్మి.

"అది నిజమే. కానీ అది ఆమె స్వభావం. ఆమె ప్రేమ వ్యక్తం చేసే తీరు అది. ఏ వ్యక్తికయినా అర్థం చేసుకునే భార్య దొరకడం పూర్వజన్మ సుకృతం అంటారు. ఏదో నాలాంటి వాడికి తప్పించి అందరికీ ఆ అదృష్టం వుంటుందా?" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"పొండి" అంటూ అతని పొగడ్తలకు పొంగిపోతూ అతని కౌగిలిలో ఒదిగిపోయింది వరలక్ష్మి. ●


**తెల్లమచ్చలు**

మా తెల్లమచ్చల మందు ప్రయోగించిన 36 గంటలలోపు మచ్చ యొక్క రంగు మారి నెమ్మదిగా శరీరం రంగులో కలిసిపోవును. '7' రోజుల మొట్టమొదటి కోర్సు ఉచితం. తప్పక-ప్రయోగించి చూడండి. వయసు, మచ్చ వివరాలు తప్పక వ్రాయండి.

Add: SRI JWALA PRASAD VAIDYA
36, KATRI SARAI - 805 105 (GAYA)